# రూ. 14 లక్షల కోట్లు క్రాష్

## భారీ నష్టాల దెబ్బకు బుల్స్ పరార్

## ఫ్యూచర్స్ కాంట్రాక్టుల్లో భారీ ఆఫ్‌లోడింగ్

## సెన్సెక్స్ 900 పాయింట్లు డౌన్

## 330 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ

## డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు నేపథ్యం



ముంబై, మార్చి 13: హఠాత్ అమ్మకాలతో బుధవారం స్టాక్ మార్కెట్ అతలాకుతలమయ్యింది. కొద్దిరోజులుగా దుందుడుకు ర్యాలీ చేస్తున్న పలు పీఎస్‌యూ, రైల్వే, అదానీ గ్రూప్ షేర్లలో ఒక వైపు నగదు మార్కెట్లోనూ, ఫ్యూచర్ కాంట్రాక్టుల్లోనూ ఒక్కసారిగా బుల్స్ భారీ ఆఫ్‌లోడింగ్‌కు పాల్పడటంతో మార్కెట్లోని మిగతా రంగాల షేర్లకు అమ్మకాలు విస్తరించాయి. దీంతో రోజుల తరబడి ఆర్జించిన రూ.14 లక్షల కోట్ల సంపద ఒక్కరోజులో ఆవిరైపోయింది. బీఎస్‌ఈలో లిస్టయిన మొత్తం కంపెనీల మార్కెట్ విలువ రూ.372 లక్షల కోట్లకు పడిపోయింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 900 పాయింట్లు పతనమై 72,762 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఇది 1100 పాయింట్లు పతనమయ్యింది. ఇదే బాటలో ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 330 పాయింట్లు నష్టపోయి 21,998 పాయింట్ల వద్ద నిలిచింది. సెన్సెక్స్ షేర్లలో అన్నింటికంటే అధికంగా పవర్‌గ్రిడ్ 7 శాతంపైగా పతనమయ్యింది. ఇండెక్స్ హెవీవెయిట్ రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.9 శాతం క్షీణించగా, ఎన్టీపీసీ, టాటా స్టీల్, టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, భారతి ఎయిర్‌టెల్, టైటాన్‌లు 3-6 శాతం మధ్య తగ్గాయి. తాజా పతనానికి పలు కారణలున్నాయి. అవి..

### సెబీ వార్నింగ్ బెల్

మార్కెట్లో కొన్ని విభాగాల్లో మురికి పేరుకుపోతున్నదని, ఫండమెంటల్స్‌తో సంబంధం లేకుండా కృత్రిమంగా పెరిగిపోతున్నాయన్న ఆందోళనల్ని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ చైర్‌పర్సన్ మాధబి పురి బుచ్ తాజాగా వ్యక్తం చేశారు. ఇలా కొన్ని పాకెట్స్‌లో గాలిబుడగలు ఏర్పడుతున్నాయని, దీనిని అనుమతించబోమని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ స్మాల్ క్యాప్, మిడ్‌క్యాప్ ఫండ్స్‌లో తాజా పెట్టుబడుల్ని తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. మార్కెట్ విలువలు అధికంగా ఉన్నాయనడానికి ఇది నిదర్శనమని విశ్లేషకులు చెప్పారు.

### మహదేవ్ బెట్టింగ్ యాప్ కేసు

చట్ట విరుద్ధంగా ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న మహదేవ్ బెట్టింగ్ యాప్‌పై ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జరిపిన దర్యాప్తులో దీనికి స్టాక్ మార్కెట్ బబుల్‌తో సంబంధం ఉన్నదని తేలింది. హవాలా ఆపరేటర్ హరిశంకర్ తిబ్రేవాలాకు చెందిన డీమ్యాట్ అకౌంట్లలో ఉన్న రూ.1,100 కోట్ల విలువైన 30 లిస్టెడ్ షేర్లను ఈడీ ఫ్రీజ్ చేసింది. ఈ చర్యతో ఆ షేర్లన్నీ భారీ పతనాన్ని చూస్తున్నాయి.

### అప్పులతోకొన్న షేర్ల ఆఫ్‌లోడింగ్

సెబీ వార్నింగ్ నేపథ్యంలో రుణాలు, బ్రోకర్ల మార్జిన్ ఫండింగ్ ద్వారా కొన్న స్మాల్, మిడ్‌క్యాప్ షేర్లను, డెరివేటివ్ పొజిషన్లను ఆఫ్‌లోడ్ చేయాలంటూ ట్రేడర్లను స్టాక్ బ్రోకర్లు ఒత్తిడి చేయడంతో అమ్మకాలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా ఆర్థిక సంవత్సరం ముగింపునకు వస్తున్నందున పొజిషన్లను స్క్వేర్‌ఆఫ్ చేసుకోవాలంటూ బ్రోకర్లు సూచిస్తున్నారు.

### లాభాలు, నష్టాల స్వీకరణ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరి కొద్ది రోజుల్లో ముగియనుండటంతో ఇన్వెస్టర్లు పన్ను ప్రయోజనాల రీత్యా కొన్నింటిలో లాభాలను, మరికొన్నింటిలో నష్టాలను బుక్‌చేస్తూ వారి పోర్ట్‌ఫోలియోల్లో మార్పులు చేసుకుంటున్నందున మార్కెట్ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యింది. సాధారణంగా ఈ ప్రక్రియను ఇన్వెస్టర్లు మార్చి నెలలో చేపడుతుంటారు.

### ఎఫ్‌పీఐల అమ్మకాలు

విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) రూ.4,595 కోట్ల విలువైన షేర్లను నికరంగా విక్రయించినట్టు స్టాక్ ఎక్స్ఛేంజీల ప్రాథమిక గణాంకాలు వెల్లడించాయి. వాస్తవానికి విదేశీ ఇన్వెస్టర్లు ఈ మధ్యకాలంలో ఎన్నడూ లేనంత స్థూలంగా రూ.33,223 కోట్ల విలువైన షేర్లను కొన్నారు. ఐటీసీలో ప్రమోటర్ బ్యాట్ విక్రయించిన రూ.17,500 కోట్ల విలువైన 3.5 శాతం వాటాలో ఎక్కువశాతం విదేశీ ఫండ్స్ కొన్నందున, ఈ విభాగంలో స్థూల అమ్మకాలు ఎక్కువ నమోదయ్యాయి. కానీ ఇదే సమయంలో ఐటీసీ షేర్లను కొని, ఇతర రంగాల షేర్లను పెద్దమొత్తంలో విక్రయించారనడానికి నిదర్శనంగా రూ. 37,818 కోట్ల స్థూల అమ్మకాలు జరిపినట్టు ఎక్స్ఛేంజీల డేటా వెల్లడిస్తున్నది. దీంతో నికరంగా రూ.4,595 కోట్లు వెనక్కు తీసుకున్నట్టయ్యింది.


### చిన్న షేర్లు విలవిల

రిటైల్ ఇన్వెస్టర్లు ఇబ్బడిముబ్బడిగా కొంటున్న చిన్న షేర్లు నిలువునా పతనమయ్యాయి. బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 5 శాతం పడిపోగా, మిడ్‌క్యాప్ సూచి 4 శాతం క్షీణించింది. మైక్రోక్యాప్, ఎస్‌ఎంఈ స్టాక్ ఇండెక్స్‌లు 6 శాతం చొప్పున తగ్గాయి. రిటైల్ ఇన్వెస్టర్లు ఫండమెంటల్స్ బలంగా లేని షేర్లలో భారీ లాభాలకు ఆశపడి పెట్టుబడి చేయడం ఆందోళనకరంగా మారిందని, దీంతో ఆ బుడగ పేలిపోయిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వీకే విజయ్‌కుమార్ వ్యాఖ్యానించారు. వివిధ రంగాల సూచీల్లో అన్నింటికంటే అధికంగా రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్‌లు 5 శాతం చొప్పున పతనంకాగా, పీఎస్‌యూ బ్యాంక్ సూచి 4 శాతం, ఆటో ఇండెక్స్ 3 శాతం చొప్పున క్షీణించాయి. ఫార్మా సూచి సైతం 2 శాతం తగ్గింది. ఐటీసీ షేర్లు 5 శాతం ర్యాలీ చేసిన ప్రభావంతో ఎఫ్‌ఎంసీజీ ఇండెక్స్ మాత్రం ఫ్లాట్‌గా ముగియగలిగింది.

## అదానీ షేర్లు ఢమాల్

స్టాక్ మార్కెట్లలో లిస్టైన అదానీ గ్రూప్ సంస్థల షేర్లన్నీ బుధవారం భారీ నష్టాలకు లోనయ్యాయి. దీంతో ఈ ఒక్కరోజే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ)లో అదానీ గ్రూప్ మార్కెట్ విలువ రూ.1,12,780.96 కోట్లు హరించుకుపోయింది. కాగా, దేశీయ స్టాక్ మార్కెట్లలో అదానీ గ్రూప్‌నకు చెందిన మొత్తం 10 సంస్థల షేర్లు ట్రేడ్ అవుతున్నాయి. వీటిలో అదానీ టోటల్ గ్యాస్ షేర్లు గరిష్ఠంగా 9.50 శాతం నష్టాలను చవిచూశాయి. అదానీ విల్మర్ షేర్లు కనిష్ఠంగా 4.25 శాతం పడిపోయాయి. ఇక గ్రూప్ ప్రతిష్ఠాత్మక సంస్థ అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు.. గత వారం రోజులుగా క్షీణిస్తూనే ఉండటం గమనార్హం. మరోవైపు తాజాగా అదానీ పవర్ షేర్ విలువ లోయర్ సర్క్యూట్ లిమిట్‌ను తాకింది.

### గ్రూప్ నష్టాలు ఇలా..



| సంస్థ | నష్టం (శాతం) |
|---|---|
| అదానీ టోటల్ గ్యాస్ | 9.50 |
| అదానీ గ్రీన్ ఎనర్జీ | 9.07 |
| అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ | 8.54 |
| ఎన్డీటీవీ | 7.92 |
| అదానీ పోర్ట్స్ | 6.97 |
| అదానీ ఎంటర్‌ప్రైజెస్ | 6.91 |
| ఏసీసీ | 6.87 |
| అదానీ పవర్ | 4.99 |
| అంబుజా సిమెంట్స్ | 4.58 |
| అదానీ విల్మర్ | 4.25 |

# సత్వర లాభాలకు ఆశ పడొద్దు

## రిటైల్ ఇన్వెస్టర్ల తీరు ఆందోళనకరం

## రిస్కీ ఎఫ్అండ్‌వోలతో ప్రయాణం నష్టమే: సీఈఏ నాగేశ్వరన్



ముంబై, మార్చి 13: రిటైల్ మదుపరులు సత్వర లాభాలను ఆశిస్తూ రిస్క్‌తో కూడిన ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్‌వో) సెగ్మెంట్‌వైపు పరుగులు పెట్టడం ఆందోళనకరమని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) వీ అనంత నాగేశ్వరన్ అన్నారు. బుధవారం ఇక్కడ క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ, ఎన్ఐఎస్ఎం సంయుక్తంగా నిర్వహించిన ఓ సదస్సుకు నాగేశ్వరన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షార్ట్ టర్మిజం అటు నిలకడైన క్యాపిటల్ మార్కెట్లకు, ఇటు స్థిరమైన దేశ ఆర్థిక వృద్ధికి ప్రమాదమేనని వ్యాఖ్యానించారు.

### సెబీ చెప్తున్నా..


రిస్కులతో కూడిన ఎఫ్అండ్‌వోల్లో పెట్టుబడులు 90%నష్టాలబారిన పడుతున్నాయని సెబీ అధ్యయనాల్లో తేలినా.. చిన్న మదుపరులు వాటి వెంటే పడుతున్నారని నాగేశ్వరన్ అన్నారు. స్వల్పకాలిక ఇన్వెస్ట్‌మెంట్ల కంటే దీర్ఘకాలిక పెట్టుబడులే శ్రేయస్కరమని చెప్పారు. కానీ రిటైల్ ఇన్వెస్టర్లు ఇవేవీ తెలియక ముందుకెళ్లి మళ్లీ మళ్లీ నష్టాలకు లోనవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరగా లాభాలను అందిపుచ్చుకోవాలనే అత్యాశే దీని వెనుక ఉందన్నారు.

### 7 శాతం వృద్ధి

వచ్చే ఆర్థిక సంవత్సరం జీడీపీ 7 శాతంగా ఉండొచ్చన్న ఆశాభావాన్ని నాగేశ్వరన్ కనబర్చారు. అలాగే అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో మూలధన అవసరాలతో నిమిత్తం లేకుండా బ్యాంకులను ప్రమోట్ చేయడానికి కార్పొరేట్ గ్రూపులకు అనుమతివ్వడం సరికాదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ఆర్థిక వ్యవస్థ ప్రగతికి అవసరమైన నిధులను బ్యాంకులు సరిపడా ఉంచుకోవాలని సూచించారు. మూలధనం అవసరమైతే తప్ప బ్యాంకింగ్ యాజమాన్యాల్లోకి కార్పొరేట్లను రానివ్వొద్దనీ అన్నారు.

# 66 వేల దిగువకు పసిడి

## తులంపై రూ.400 తగ్గిన ధర



న్యూఢిల్లీ, మార్చి 13: రికార్డు స్థాయిలో దూసుకుపోయిన బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. దేశీయంగా పెళ్లిళ్ల సీజన్ కొనసాగుతున్నప్పటికీ అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ పడిపోవడంతో పుత్తడి ధర రూ.66 వేల దిగువకు పడిపోయింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పది గ్రాముల బంగారం ధర రూ.400 తగ్గి రూ.65,950కి దిగింది. అంతకుముందు రూ.66,350గా ఉన్నది. అటు పసిడితోపాటు వెండి కూడా దిగొచ్చింది. రూ.600 తగ్గిన కిలో వెండి రూ.75,300కి తగ్గింది. ఇటు హైదరాబాద్‌లోనూ 24 క్యారెట్ తులం బంగారం ధర రూ.420 తగ్గి రూ.66,260 నుంచి రూ.65,840కి దిగొచ్చింది. 22 క్యారెట్ పుత్తడి ధర రూ.390 తగ్గి రూ.60,350గా నమోదైంది. బంగారంతోపాటు వెండి ఏకంగా రూ.1,000 తగ్గి రూ.79,500 నుంచి రూ.78,500కి తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,160 డాలర్లకు తగ్గింది. గత ముగింపుతో పోలిస్తే 17 డాలర్లు తగ్గింది. అలాగే వెండి 24.44 డాలర్ల నుంచి 24.22 డాలర్లకు దిగొచ్చింది. అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు అంచనాకంటే అధికంగా నమోదవడంతో వచ్చే సమీక్షలో ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలున్నాయన్న సంకేతాలతో గ్లోబల్ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు తగ్గుముఖం పట్టాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి.

## ఎయిర్‌బస్‌తో సైయెంట్ జట్టు

హైదరాబాద్, మార్చి 13: హైదరాబాద్ కేంద్రంగా ఐటీ సేవలు అందిస్తున్న సైయెంట్..ప్రముఖ విమానాల తయారీ సంస్థ ఎయిర్‌బస్‌తో జట్టుకట్టింది. క్యాబిన్, కార్గో ఇంజినీరింగ్ సేవలను అందించడానికి ఈ ఒప్పందం చేసుకున్నట్టు సైయెంట్ వర్గాలు వెల్లడించాయి. ఇంటిలిజెంట్ కోర్ మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫాం(ఐసీఎంపీ)ని అభివృద్ధి చేయడానికి ఎయిర్‌బస్‌ను ఎంపిక చేసినట్టు తెలిపింది.

# రద్దీ ప్రాంతాల్లోనే..

- రిటైల్ స్టోర్లను తెరిచేందుకు లగ్జరీ బ్రాండ్ల ఎంపిక
- గత ఏడాది మార్కెట్ ట్రెండ్‌పై సీబీఆర్‌ఈ నివేదిక



న్యూఢిల్లీ, మార్చి 13: లగ్జరీ బ్రాండ్ల సంస్థలు కొత్తగా తమ రిటైల్ స్టోర్లను తెరిచేందుకు రద్దీ ప్రాంతాల్లోని షాపింగ్ మాల్స్‌నే ఎంపిక చేసుకుంటున్నట్టు తేలింది. గత ఏడాది మార్కెట్ ట్రెండ్‌పై రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సీబీఆర్‌ఈ, పీహెచ్‌డీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (పీహెచ్‌డీసీసీఐ) బుధవారం సంయుక్తంగా ఓ నివేదికను విడుదల చేశాయి. 2022 నుంచి 2023 వరకు వివిధ రకాల రిటైల్ రంగాల వ్యాప్తంగా లగ్జరీ రిటైల్ లీజింగ్ తీరుతెన్నులను హైలైట్ చేస్తూ 'భారతీయ లగ్జ'రీ' ఆరోహణం' పేరిట ఈ రిపోర్టును తెచ్చాయి. హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూరు, కోల్‌కతా, పుణె, అహ్మదాబాద్, చెన్నై నగరాల్లోని లీజింగ్ కార్యకలాపాల ఆధారంగా ఈ నివేదిక రూపొందింది. 'గత ఏడాది దేశంలోని 8 ప్రధాన నగరాల్లో తమ రిటైల్ స్టోర్లను తెరిచేందుకు లగ్జరీ బ్రాండ్ల కంపెనీలు ప్రధాన కూడళ్లను, జన సంచారం ఎక్కువగా ఉండే చోట్లనే ఎంచుకున్నాయి' అని సీబీఆర్‌ఈ తెలిపింది.

లగ్జరీ రిటైల్ రంగంలో భారత్ స్థానం చెప్పుకోదగ్గ స్థాయిలోనే మెరుగుపడుతున్నది. పెరుగుతున్న విదేశీ పర్యాటకుల నేపథ్యంలో అంతర్జాతీయ ప్రముఖ బ్రాండ్లు దేశంలోకి అడుగుపెడుతున్నాయి. ముఖ్యంగా లగ్జరీ బ్రాండ్లకు చెందిన వాచీలు, ఆభరణాలు, దుస్తులు, పాదరక్షలకు డిమాండ్ ఉన్నది. ముున్ముందూ ఈ ట్రెండ్ ఇలాగే సాగుతుందని చెప్పవచ్చు.

- అన్షుమన్ మ్యాగజైన్, సీబీఆర్‌ఈ ఇండియా చైర్మన్
- మాల్స్‌లో లగ్జరీ బ్రాండ్ల సంస్థలు లీజుకు తీసుకున్న రిటైల్ స్పేస్ 2023లో 0.24 మిలియన్ చదరపు అడుగులుగా ఉన్నది. 2022తో పోల్చితే 300 శాతం వరకు పెరిగింది.
- విశాలంగా ఉండే వీధుల్లో లగ్జరీ బ్రాండ్లు లీజుకు తీసుకున్న స్థలం నిరుడు 0.3 మిలియన్ చదరపు అడుగులుగా నమోదైంది. అంతకుముందు ఏడాదితో చూస్తే 100 శాతానికిపైగా ఎగిసింది.
- ఎక్కడైనా ఒంటరిగా ఏర్పాటు చేసే స్టోర్ల కోసం లగ్జరీ బ్రాండ్ల లీజింగ్ గత ఏడాది 0.1 మిలియన్ చదరపు అడుగులు. ఏడాది ప్రాతిపదికన 200 శాతానికిపైగా పుంజుకున్నట్టు తేలింది.
- మొత్తంగా అన్ని ఫార్మాట్లలో లగ్జరీ బ్రాండ్ల కంపెనీలు 2023లో లీజుకు తీసుకున్నది 0.6 మిలియన్ చదరపు అడుగులుగా ఉన్నది. 2022తో పోల్చితే దాదాపు 170 శాతం పెరుగుదల కనిపిస్తున్నది.

## స్కూటర్ల ధరలు తగ్గించిన క్వాంటమ్



### 10 శాతం వరకు కోత పెట్టిన సంస్థ

హైదరాబాద్, మార్చి 13: ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన స్టార్టప్ సంస్థ క్వాంటమ్ ఎనర్జీ..ఇటీవల మార్కెట్లోకి విడుదల చేసిన రెండు స్కూటర్ల ధరలను తగ్గించింది. ప్లాస్మా ఎక్స్, ఎక్స్‌ఆర్ మాడళ్ల ధరలను 10 శాతం కోత పెట్టినట్టు వెల్లడించింది. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో ప్లాస్మా ఎక్స్ మాడల్ ధర రూ.1,19,525 నుంచి రూ.1,09,000కి దిగిరాగా, అలాగే ఎక్స్‌ఆర్ మాడల్ రూ.99,757 నుంచి రూ.89 వేలకు తగ్గాయని కంపెనీ ఎండీ చక్రవర్తి తెలిపారు. ఈ తగ్గింపు ఆఫర్ ఈ నెల 31 వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయని చెప్పారు. కేవలం 7.5 సెకండ్లలోనే 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ప్లాస్మా ఎక్స్ గంటకు 65 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోనున్నది. సింగిల్ చార్జింగ్‌తో 110 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.

# గోల్డ్ లోన్లపై కన్నేయండి

## ప్రభుత్వ బ్యాంకులకు ఆర్థిక శాఖ సూచన

## నిబంధనల ఉల్లంఘనలే కారణం



న్యూఢిల్లీ, మార్చి 13: బంగారాన్ని తాకట్టు పెట్టుకొని ఇచ్చిన రుణాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించాలని అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సూచించింది. ఈ మేరకు ఆయా బ్యాంకుల అధిపతులకు ఆర్థిక సేవల శాఖ (డీఎఫ్‌ఎస్) నుంచి సమాచారం అందింది. 'గోల్డ్ లోన్ బిజినెస్‌పై సమగ్ర సమీక్ష చేపట్టాలని మేము బ్యాంకులను కోరాం' అని ఆర్థిక సేవల కార్యదర్శి వివేక్ జోషి పీటీఐతో అన్నారు. అయితే నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్టు ప్రభుత్వం దృష్టికి రావడమే ఇందుకు కారణంగా తెలుస్తున్నది. కాగా, ఫీజుల వసూలు, వడ్డీరేట్లు, గోల్డ్ లోన్ ఖాతాల మూసివేత వంటి వాటికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని గత నెలే బ్యాంకులకు ఆర్థిక శాఖ సలహా ఇచ్చినట్టు సమాచారం. బంగారాన్ని తనఖా పెట్టుకోకుండానే రుణాలిచ్చినట్టు కూడా కేంద్ర ప్రభుత్వం దృష్టికి రావడం గమనార్హం. దీంతో 2022 మొదలు ఈ ఏడాది జనవరి ఆఖరుదాకా ఇచ్చిన గోల్డ్ లోన్లలో అవకతవకలు ఏవైనా జరిగాయా? నిబంధనల్ని సరిగ్గా పాటించారా? అన్న కోణంలో దృష్టి పెట్టాలని బ్యాంకులకు ఓ లేఖ ద్వారా డీఎఫ్‌ఎస్ ఆదేశాలిచ్చింది.

### 75 శాతాన్ని మించరాదు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నిబంధనల ప్రకారం.. ఖాతాదారులు తనఖా పెట్టిన బంగారం విలువలో 75 శాతాన్ని మించి రుణాలుగా బ్యాంకులు ఇవ్వరాదు. గోల్డ్ లోన్లను ఇస్తున్న ఇతర బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలకూ ఇదే వర్తిస్తుంది. అయితే కరోనా సమయంలో మాత్రం ఈ నిబంధనల్ని ఆర్బీఐ సడలించింది. 90 శాతానికి పెంచింది. కానీ 2020 ఆగస్టు నుంచి 2021 మార్చి 31 వరకే ఈ అవకాశం ఇచ్చింది. ఇదిలావుంటే ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ లిమిటెడ్‌ను ఆర్బీఐ ఇటీవలే గోల్డ్ లోన్లు ఇవ్వకుండా నిషేధించిన సంగతి విదితమే. వివిధ రకాల పర్యవేక్షణ లోపాలే కారణం. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకులకు కేంద్ర ఆర్థిక శాఖ నుంచి వచ్చిన సూచనలు ఇప్పుడు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

### ఎస్బీఐ టాప్

*గోల్డ్ లోన్ వ్యాపారంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ముందున్నది. గత ఏడాది డిసెంబర్ ఆఖరుకల్లా బ్యాంక్ పోర్ట్‌ఫోలియో రూ.30,881 కోట్లుగా ఉన్నది. ఆ తర్వాత పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రూ.5,315 కోట్లుగా, బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) రూ.3,682 కోట్లుగా ఉన్నాయి. కాగా, బంగారం ధరలు దేశీయ మార్కెట్‌లో ఇటీవల ఆల్‌టైమ్ హైకి చేరుకున్నది తెలిసిందే. 24 క్యారెట్ 10 గ్రాముల పుత్తడి రేటు ఏకంగా మునుపెన్నడూ లేనివిధంగా రూ.67,705 పలికింది. కేవలం నెల రోజుల్లోనే తులం విలువ రూ.4,240 పుంజుకోవడం విశేషం.*

# చిప్ ప్లాంట్‌తో 72 వేల మందికి ఉపాధి

- టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్




*చిప్ ప్లాంట్ భూమిపూజ సందర్భంగా గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్*

దోలేరా, మార్చి 13: ఉప్పు నుంచి కంప్యూటర్ వరకు సేవలు అందిస్తున్న టాటా గ్రూపు తాజాగా చిప్‌ల తయారీ రంగంలోకి అడుగుపెట్టింది. అస్సాంలో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేయతలపెట్టిన చిప్ తయారీ ప్లాంట్‌ను ప్రధాని నరేంద్ర మోదీ వర్చ్యువల్‌గా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ... దశలవారీగా టాటా ఎలక్ట్రానిక్స్ 72 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నదని చెప్పారు. రూ.91 వేల కోట్లతో చిప్ తయారీ ప్లాంట్‌ను, రూ.27 వేల కోట్లతో చిప్ అసెంబ్లి యూనిట్‌ను సంస్థ నెలకొల్పబోతున్నది. ఇప్పటికే ఆటోమోటివ్, పవర్, ఎలక్ట్రానిక్స్, కన్స్యూమర్, మెడికల్ రంగాల్లో సేవలు అందిస్తున్న సంస్థ..కొత్తగా ఎలక్ట్రానిక్స్ చిప్‌ల తయారీలోకి కూడా అడుగుపెట్టబోతున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ చిప్ యూనిట్‌లో 28 నానోమీటర్ల నుంచి 110 నానోమీటర్ల నోడ్స్‌లను తయారు చేయనున్నట్లు తెలిపారు. హై-టెక్ గాడ్జెట్‌లైన స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్లెట్లలో ఇలాంటి చిప్‌ల అవసరమవుతాయని, ముఖ్యంగా 3 ఎన్‌ఎం, 7 ఎన్‌ఎం, 14 ఎన్‌ఎం కూడా అవసరమని పేర్కొన్నారు. ఈ యూనిట్ అందుబాటులోకి వస్తే వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ఇది ప్రారంభం మాత్రమేనని..భవిష్యత్తు ముందున్నది..కనీసంగా 50 వేల మందికి ఉపాధి లభించనుండగా..వీరిలో అస్సాంలోనే 20-22 వేల మందికి అవకాశాలు లభించనున్నాయన్నారు.

### 2026లో తొలి చిప్: వైష్ణవ్

టాటా ఎలక్ట్రానిక్స్ ఏర్పాటు చేస్తున్న ప్లాంట్‌లో తొలి చిప్ రెండేండ్ల తర్వాత అందుబాటులోకి రానున్నట్లు కేంద్ర కమ్యూనికేషన్స్, ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇప్పుడిప్పుడే చిప్‌ల తయారీ రంగంలో అడుగుపెట్టినట్టు, 2029 నాటికి టాప్-5 ప్రపంచ చిప్ తయారీ దేశాల సరసన చేరనున్నట్లు ఆయన ప్రకటించారు. టాటా ఎలక్ట్రానిక్స్ ధోలేరా ప్లాంట్ డిసెంబర్ 2026 నాటికి సిద్ధమవనుండగా, మైక్రాన్ ప్లాంట్ ఈ ఏడాది చివరినాటికి అందుబాటులోకి రానున్నదన్నారు. ధోలేరా ప్లాంట్‌లో 28, 50, 55 నానోమీటర్ నోడ్ చిప్‌లను తయారు చేయనున్నది. తైవాన్‌కు చెందిన పవర్‌చిప్ సెమికండక్టర్ తయారీ సంస్థతో కలిసి టాటా ఎలక్ట్రానిక్స్ ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నది. ఈ ప్లాంట్లో రోజుకు 15 మిలియన్ల చిప్‌లు తయారుకానున్నాయి.

# ఈ-మొబిలిటీకి 500 కోట్లు

## ద్వి, త్రిచక్ర వాహనాలకు కేంద్రం కేటాయింపు



న్యూఢిల్లీ, మార్చి 13:ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం మరో నూతన స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చింది. వచ్చే నెల నుంచి అందుబాటులోకి రానున్న ఈ స్కీం కోసం రూ.500 కోట్ల నిధులను ప్రకటించింది. ద్విచక్ర, త్రిచక్ర వాహనాల కోసం మాత్రమే ఈ స్కీంను ప్రవేశపెట్టింది. గతంలో ప్రకటించిన ఫేమ్-2 ఈ నెల 31తో ముగియనుండటంతో ఈ సరికొత్త స్కీంను తెరపైకి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్ర నాథ్ పాండే మాట్లాడుతూ.. దేశంలో ఈ-మొబిలిటీ వాహనాలను ప్రోత్సహించడానికి నరేంద్ర మోదీ సర్కార్ కట్టుబడివున్నదని, ఈ సరికొత్త స్కీం జూలై చివరినాటికి అందుబాటులో ఉంటుందని తెలిపింది. ఈ స్కీం కింద రూ.10 వేల వరకు ద్విచక్ర వాహనాలకు రాయితీ లభించనున్నది. 3.33 లక్షల యూనిట్ల ద్విచక్ర వాహనాలకు వర్తించనున్నది. అలాగే చిన్న స్థాయి త్రి చక్ర వాహనాలు(ఈ-రిక్షా, ఈ-కార్ట్స్)లకు రూ.25 వేల వరకు రాయితీకి లభించనున్నాయి. 41 వేల వాహనాలకు వర్తించనున్నది. వీటితోపాటు అతిపెద్ద త్రి-చక్ర వాహనాలపై కూడా రూ.50 వేల వరకు డిస్కౌంట్ కల్పిస్తున్నది. గతంలో ప్రకటించిన ఫేమ్-2 స్కీం ఈ నెల చివరి నాటికి లేదా నిధులు ఉన్నంత వరకు అమలులో ఉంటుందని పేర్కొంది. మరోవైపు, ఎలక్ట్రిక్ వాహన స్కూటర్ల వాడకాన్ని ప్రోత్సహించడానికి భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ..ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-రూర్కీతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది.